క్లుప్తంగా

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ



దొంగలు పగులగొట్టిన హుండీ

భోగాపురం: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు హుండీ తాళాన్ని పగులగొట్టి అందులో ఉన్న నగదును అపహరించుకుపోయారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం ఉదయం గుడి వద్దకు చేరుకుని సీసీ కెమెరాలను పరిశీలించగా... నలుగురు వ్యక్తులు బైక్‌పై వచ్చి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్య, వైద్యరంగాలకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని ఘోష ఆస్పత్రిని గత ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురి చేసిందని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. అశోక్ బంగ్లాలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, బొద్దుల నర్సింగరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ మాజీ సభ్యుడి మృతికి సంతాపం



బొంతు అప్పలనాయుడు

పూసపాటిరేగ: పూసపాటిరేగ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొంతు అప్పలనాయుడు శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. పేరాపురం సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, ఒకసారి జెడ్పీటీసీగా సేవలందించారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరితో స్నేహపూర్వకంగా ఉంటూ సేవలందించారు. ఆయన మృతికి ఎమ్మెల్యే లోకం మాధవి, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారితో పాటు నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు అప్పలనాయుడు భౌతిక ఖాయానికి నివాళులర్పించారు.

కనకమహాలక్ష్మికి అభిషేకాలు



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో ఆదివారం ఉదయం పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం వద్ద మధ్యాహ్నం ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

ఆలయ నిర్మాణానికి సహకారం



ఆలయ ట్రస్టు సభ్యులకు నగదు అందజేస్తున్న దాత కామునాయుడు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో చేపడుతున్న హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి గుర్ల మండలంలోని లవిడాం గ్రామానికి చెందిన లండ కామునాయుడు రూ.50 వేల ఆర్థిక సహాయం చేశారు. ఆదివారం ఆయన తన నివాసం వద్ద ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు నగదు అందజేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, గంట్యాడ విష్ణుమూర్తి, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, గంట్యాడ బుజ్జి, గంట్యాడ సీతరాజు, దిలీప్‌కుమార్ ధనూకా, గుడ్ల శ్రీను, గొల్ల తదితరులు పాల్గొన్నారు.

అతిగా వాడితే అనర్థమే..

- మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు
- ఎక్కువైతే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం
- రసాయన మందులు పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి
- అన్నదాతలకు వ్యవసాయాధికారి సూచనలు



పూసపాటిరేగ: సాంకేతికత పెరుగుతున్నా వ్యవసాయంలో రైతులు ఇంకా పాత పద్ధతినే అవలంభిస్తున్నారు. దీని వల్ల ఏటా సాగు పెట్టుబడులు పెరుగుతున్నాయి. సరైన దిగుబడులు రాక రైతులు నష్టపోతున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు మోతాదుకు మించి వినియోగిస్తుండటంతో సాగు వ్యయం పెరిగిపోవడంతో పాటు భూసారం దెబ్బతిని ఆ ప్రభావం పంట దిగుబడిపై పడుతోంది. ఈ నేపథ్యంలో ఎరువులు, పురుగుమందుల వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలని వ్యవసాయశాఖ సిబ్బంది సూచిస్తున్నారు. మోతాదుకు మించి వినియోగిస్తే అనర్థమే తప్ప ఉపయోగం ఉండదని అంటున్నారు. సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని, భూసార పరీక్షలు చేయించి వాటి ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వేసుకోవాలని, ఎరువుల వినియోగంలో వ్యవసాయశాఖ సిబ్బంది సూచనలు, సలహాలు కచ్చితంగా పాటించాలని సూచిస్తున్నారు. పంటకు నీటి తడి అందించిన తర్వాత ఉదయం వేళల్లో ఎరువులు, పురుగుమందులు వేసుకుంటే ఫలితం ఉంటుంది. 25 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న సమయంలో పంటలకు పిచికారి చేయాలి. పురుగు మందులు పిచికారీ సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే హానికర రసాయనాలు ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపిస్తాయి.

పిచికారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- గాలికి ఎదురుగా రసాయన మందులు పిచికారీ చేయకూడదు
- తెగులు మందు, పురుగు మందు కలిపి పిచికారీ చేయాలి
- చేతులకు గ్లౌజులు, నోరు, ముక్కుకు మాస్కులు వేసుకోవాలి
- మందులు పిచికారీ చేసి కళ్లు, ముక్కు, నోరు, చేతులుతో రుద్దుకోరాదు
- భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి
- రసాయిన మందులు పిచికారీ సమయంలో స్ప్రేయర్లు లీకేజీ ఉండరాదు
- ద్రావణం కలిపే మందు డబ్బాపై సూచించిన మేరకు గానీ, వ్యవసాయ అధికారులు సూచించిన మేరకుగాని పిచికారీ చేయాలి
- రసాయన మందు పిచికారీ చేసే సమయంలో కడుపుమంట, దద్దుర్లు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి

మోతాదుకు మించి వాడరాదు



వ్యవసాయశాఖ సిబ్బంది సూచించిన మేరకు తగిన మోతాదులో పంటకు ఉదయం వేళల్లో పురుగుమందులు పిచికారీ చేయాలి. ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు, కళ్లకు అద్దాలు ధరించి పిచికారీ చేయాలి. కలుపుమందు కొట్టిన తరువాత పురుగుమందు కొట్టరాదు. మొక్కలపై భాగంతో పాటు క్రింది భాగం తడిసేలా పిచికారీ చేస్తే ఆకు కింద ఉన్న రసం పీల్చే పురుగులు నశిస్తాయి.

– కొల్లి నీలిమ, వ్యవసాయ అధికారి, పూసపాటిరేగ

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న డాక్టర్ శ్రీరామ్మూర్తి

విజయనగరం ఫోర్ట్: విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని కొప్పలవెలమ సంక్షేమ సంఘం నాయకులు డాక్టర్ అక్కెన శ్రీరామ్మూర్తి అన్నారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 24 మంది విద్యార్థులకు స్థానిక కామాక్షీ నగర్‌లో ఉన్న కొప్పల వెలమ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఒక్కో విద్యార్థికి రూ.5 వేలు చొప్పున అందజేశారు. సంఘంలో ఉన్న పేద వర్గాల వారిని ఆదుకునేందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని ఈ సందర్భంగా సంఘ సభ్యులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, కార్పొరేటర్ ఎస్ఎస్‌వీ రాజేష్, సంఘం ప్రతినిధులు బొత్స వరప్రసాద్, కోరుపోలు పరదేశినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



కె.ఎర్నినాయుడు (అధ్యక్షుడు)



ఆర్.బాలకృష్ణ (ప్రధాన కార్యదర్శి)

విజయనగరం అర్బన్: జిల్లా గ్రంథాలయ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని స్థానిక సంఘం కార్యాలయంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.ఎర్నినాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.బాలకృష్ణ, కోశాధికారిగా పీఏ రామరాజు, గౌరవ అధ్యక్షుడిగా ఎస్ఎస్ఎస్ రాజు, ఉపాధ్యక్షుడిగా కె.దయానంద్, ఎస్.వాసుదేవరావు, సహాయ కార్యదర్శులుగా రెడ్డి రమణ, ఎం.జనార్ధన్, టి.చిరంజీవి, కొల్లి సత్యం, జీఎస్‌చలం, ముఖ్య సలహాదారులుగా కడలి ప్రకాశరావు, డాక్టర్ ఎంవీఎస్ వెంకటరావు ఎన్నికైనట్లు సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్ తెలిపారు. వారితో పాటు 15 మంది కార్యదర్శ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కమిటీ 3 సంవత్సరాల పాటు సేవలందించనుంది.

నిత్యావసర సరుకుల పంపిణీ



వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు

కొత్తవలస: తుమ్మికాపల్లి గ్రామ సమీపంలోని ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు కార్యాలయం వద్ద మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 42 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యావసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్ విశ్వనాథ్ హరికుమార్ మాట్లాడుతూ మండలంలోని దెందేరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సునీత, ఇతర ఉపాధ్యాయుల సహకారంతో సరుకులు పంపిణీ చేశామని తెలిపారు. దాతలు మాట్లాడుతూ ఫర్ ది పీపుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతీ నెల ఒంటరి వృద్ధులకు నిత్యావ సర సరుకులు పంపిణీ చేస్తుండడం అభినందనీయమన్నారు.అనంతరం హెచ్‌ఎం సునీత దంపతు లను, ఉపాధ్యాయులను ట్రస్టు చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ సంతోష్ కుమార్, ట్రెజరర్ శ్రావణ్‌కుమార్ సభ్యులు గోవిందరావు,నగేష్, గణేష్ తదితరులు సన్మానించారు.

కౌలు రైతుపై దాడి అమానుషం

విజయనగరం అర్బన్: కౌలు రైతుల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు కామినేని రామారావుపై దాడిని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. దాడికి కారకులైన టీడీపీ కార్యకర్తలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం, జిల్లా కార్యదర్శి బి.రాంబాబు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిలిపివేసిన సామాజిక పింఛన్లను వెల్ఫేర్ అసిస్టెంట్లను సంప్రదించి అర్హులకు ఇప్పించేందుకు కృషి చేసినందుకు కక్షతో దాడి చేశారని ఆరోపించారు. దాడి చేసిన వారు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

విజయనగరం క్రైమ్: స్థానిక మయూరీ కూడలి వద్ద ఉన్న హోటల్ వైట్లా వెనుక వైపు ఉన్న ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్న 11 మందిని ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,12,800లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరిబాబునాయుడు తెలిపారు.

వారాహి నవరాత్రి పూజలు



బ్రహ్మిదేవి అలంకరణలో రాజరాజేశ్వరీదేవి

బొండపల్లి: వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవుపల్లిలోని రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో రెండోరోజు ఆదివారం అమ్మవారు బ్రహ్మిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ధూసి శ్రీధర్ శర్మ భక్తులతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన చేయించారు.

లోటు వర్షపాతం..
రైతులకు పాట్లు

- 20 శాతమే పూర్తయిన వరి నారుపోతలు
- నారుమడులు సిద్ధంచేసిన చోట నారును రక్షించుకునేందుకు రైతులు పాట్లు
- ట్యాంకర్లతో నీటిని తీసుకువచ్చి నారును తడుపుతున్న వైనం



బొండపల్లి: బొండపల్లిలో ట్యాంకర్‌తో నీటిని తెచ్చి వరినారును తడుపుతున్న రైతులు

బొండపల్లి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా, ఇంత వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. జూన్ నెలకు సంబంధించి 25 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూలై నెలకు సంబంధించి వారం రోజుల క్రితం కురిసిన వర్షమే తప్ప..ఆ తర్వాత ఎక్కడా వర్షం కురవలేదు. మండలంలో ఇప్పటి వరకు 20 శాతం రైతులు మాత్రమే వరినారు మడులు తయారు చేశారు. నారు పోసిన నాటి నుంచి వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో నారు ఎండి పోకుండా కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నా రు. చెరువుల్లో అంతంత మాత్రంగా ఉన్న నీటిని ట్రాక్టర్ ట్యాంకర్లతో తీసుకు వచ్చి నారును తడుపుతున్నారు. ఒక ట్యాంకరు నీటికి దూరాన్ని బట్టి రూ.500 నుంచి రూ.1000 వరకు రైతు లు చెల్లించుకోవాల్సి వస్తోంది. గజపతినగరం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలోని మెంటాడ,బొండపల్లి, దత్తిరాజేరు,గజపతినగరం మండలాల్లో ఖరీఫ్ వరి సాధారణ సాగు విస్తీర్ణం 13, 500 వేల హెక్టార్లు కాగా అందులో 20 శాతం మేరకు నాట్లు వేయడానికి సరిపోయేలా ప్రస్తుతానికి రైతులు నారు పోశారు. వరుణుడు కరుణించకుంటే ఈ ఏడాది వరి సాగు కష్టమేనని రైతులు అంటున్నారు.

ఎండుతున్న వరి నారుమడులు



దత్తిరాజేరు: మరడాం వద్ద ఎండిపోతున్న వరి నారు

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా వర్షాలు ఆశాజనకంగా కురవక పోవడంతో వరి నారుమడులు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కొద్దిరోజుల క్రితం అరకొరగా వర్షా లు కురువడంతో నారు పోశామని, అయితే అప్పటి నుంచి వరుణుడు ముఖం చాటేయడంతో వరి నారు ఎండిపోతోందని దత్తి, దత్తిరాజేరు, గడసాం, పోరలి, లింగా లవలస గ్రామాల రైతులు చెబుతున్నారు. కోమటిపల్లి,పెదమానాపురం మరడాం, ఇంగిలాపల్లి గదబవలస, తాడేందొరవలస గ్రామాల్లో పోసిన నారు ఇంకా మొలకెత్త లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మూఢ విశ్వాసాల నిరోధక చట్టం తీసుకురావాలి



నినాదాలు చేస్తున్న జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ

- జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ డిమాండ్

విజయనగరం అర్బన్: దేశవ్యాప్తంగా జరుగుతున్న బాబాల దారుణ సంఘటనలను నిరోధించడానికి మూఢ విశ్వాసాల నిరోధక చట్టాన్ని తీసుకురావాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ సిబ్బంది భవన్‌లో ఆదివారం జరిగిన జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఉత్తర ప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లాలో జరిగిన దారుణ సంఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ.. ఈ ఘటనకు ప్రధాన కారకుడైన భోలే బాబాను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. తన పాద ధూళి మహిమగలదనే అశాస్త్రీయ, అభూత కల్పనలు ప్రజలలో ఆ బాబా వ్యాప్తి చేశాడని, ప్రార్థన సమావేశానికి హాజరైన ప్రజలు ఆయన నడిచిన దారిలో పాదధూళి సేకరించేందుకు పోటీపడటంతో జరిగిన తొక్కిసలాటలో దాదాపు 150 మందికి పైగా అమాయక ప్రజలు మృతి చెందారన్నారు. దీనికి కారణమైన ఆ బాబాను కఠినంగా శిక్షించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు మూఢవిశ్వాసాల నిరోధక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే రాజ్యాంగంలోని ఆర్టికల్ 51(ఏహెచ్) ప్రకారం ప్రజలందరిలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎంవీఎస్ వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి పి.రమణప్రభాత్, సభ్యులు కె.మురళీబాబు, జి.నిర్మల, వి.మోహనరావు, సత్యశ్రీనివాస్, కె.శశిధర్, డాక్టర్ చిన్నారి, సీహెచ్ సింహాచలం, ఎంజీవీ ప్రసాద్, వి.రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సవరవల్లి వద్ద వంతెన నిర్మాణానికి కృషి చేస్తా..

- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



ఎంపీ అప్పలనాయుడుకి సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి, స్థానిక నాయకులు

భోగాపురం: మండలంలోని సవరవల్లి ఊరు మధ్య నుంచి జాతీయ రహదారి ఉండడం వల్ల స్కూల్‌కి వెళ్లే పిల్లలు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతుండడమే కాకుండా ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానిక నాయకులు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశాక శనివారం జిల్లాకు వచ్చిన ఆయన్ను ఎమ్మెల్యే లోకం నాగమాధవి, స్థానిక నాయకులు కర్రోతు బంగార్రాజు కలిసి సమస్యను వివరించారు. సవరవల్లి వద్ద అండర్ పాస్ వంతెన నిర్మించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ అప్పలనాయుడు ఆదివారం సవరవల్లి చేరుకుని జాతీయ రహదారిని పరిశీలించారు. నేషనల్ హైవే అధికారులతో చర్చించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా అండర్ పాస్ వంతెన లేదా ఫ్లైఓవర్ వంతెన నిర్మించడానికి కృషి చేస్తానన్నారు. దీంతో పాటు డెంకాడ మండలం మోదవలస, పూసపాటిరేగ మండలం పేరాపురం జాతీయ రహదారుల వద్ద వంతెనలు లేక ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే నాగమాధవి ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు, కర్రోతు సత్యం, దంతులూరి సూర్యనారాయణరాజు, వందనాల రమణ, ఇమ్మంది కూర్మరావు, బొల్లు త్రినాద్, మాత నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఈగలతో అవస్థలు



గంట్లాంలోని ఒక ఇంటిలో చేరిన ఈగలు

డెంకాడ: హేచరీ కారణంగా మా గ్రామంలో దుర్గంధంతో పాటు ఈగలు విజృంభిస్తున్నాయని, పెద్ద సంఖ్యలో ఈగలు చుట్టుముట్టడంతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని గంట్లాం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నముద్ద నోటిలో పెడదామంటే ముద్దతో పాటు ఈగలు నోటిలోకి వెళ్తున్నాయని వాపోతున్నారు. ఆహార పదార్థాలు కలుషితం కావడంతో రోగాల బారిన పడతామోనని ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి 300 మీటర్ల దూరంలో ఉన్న శ్రీనివాస హేచరీ వ్యర్థాల కారణంగానే ఈగలు గ్రామంలోకి వస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై గత నెల 28న జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఈఓపీఆర్డీ జగన్నాథం, పంచాయతీ అధికారులు గ్రామంలో పర్యటించి వాస్తవాలు పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. గ్రామంలో ఈగల సమస్య ఉన్నట్లు గుర్తించి నివారణ కోసం రసాయన మందులను పిచికారీ చేశారు. అయినా ఈగలు ఏమాత్రం తగ్గలేదని గ్రామస్తులు తెలిపారు. అలాగే శ్రీనివాస హేచరీకి పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. పౌల్ట్రీ వ్యర్థాలను సుదూర ప్రాంతాలకు తరలించాలని, ఈగల పునరుత్పత్తి కాకుండా చర్యలు తీసుకోవాలని పౌల్ట్రీ యాజమాన్యాన్ని ఆదేశించారు.

గురుదేవ ట్రస్టు సేవలు అభినందనీయం



దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు తొడుగుతున్న థయో ల్యాబ్స్ ఎండీ వంశీ, డైరెక్టర్ చంద్రశేఖర్

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్టు దివ్యాంగులకు అందిస్తున్న సేవలు అభినందనీయని విశాఖపట్నానికి చెందిన థయో ల్యాబ్స్ ఎండీ డి.ఆర్.వంశీ కొనియాడారు. థయో ల్యాబ్స్ డైరెక్టర్ పి.చంద్రశేఖర్‌తో కలిసి గురుదేవా చారిటబుల్ ట్రస్టును ఆదివా రం ఆయన సందర్శించారు. ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ స్పెషాలటీ ఆస్పత్రి, కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కృత్రియ అవయవాల తయారీ విధానం, ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు వారికి వివరించారు. అనంతరం వంశీ, చంద్రశేఖర్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో దివ్యాంగులకు ఇంతటి సేవలు అందిస్తున్న ఏకైక సంస్థ గురుదేవ ట్రస్టు కావడం విశేషమన్నారు. ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు తన జీవితాన్ని దివ్యాంగులు, నిరాశ్రయుల సేవకే అంకితం చేసి పలువురుకి ఆదర్శంగా నిలిచారన్నారు. ట్రస్టుకు తమ పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు దివ్యాంగులకు ఉచితంగా కృత్రియ అవయవాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ డాక్టర్ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో పశుగ్రాసం విత్తనాలు

లక్కవరపుకోట: పాడిరైతులకు 75 శాతం రాయితీపై పంపిణీ చేసేందుకు పశుగ్రాసం విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని ఎల్.కోట పశువైద్యాధికారి గాయత్రీదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఎస్‌హెచ్-24 ఎంఎఫ్ రకం జొన్న గడ్డి విత్తనాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. మండలానికి వచ్చిన టన్ను విత్తనాలను రైతు సేవాకేంద్రాలకు సరఫరా చేశామని స్పష్టం చేశారు. 5 కిలోల విత్తనాల కిట్ ఖరీదు రూ. 460 కాగా రాయితీపై రూ.115కు రైతులకు అందించనున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.